
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం
శనివారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 29 । కనిష్ఠం 18 | భద్రాద్రి: గరిష్ఠం 28 । కనిష్ఠం 18 ◆ ఆదివారం, 7 జనవరి 2024


పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి విజేత ఎం.నీరజ

ఇల హరివిల్లు


పాల్వంచ అనుబోస్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

- తెలుగు సంస్కృతికి పట్టం కట్టిన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'
- ముందుతరాలకు స్ఫూర్తిదాయకం ఈ ముగ్గుల పోటీలు
- కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి
- పాల్వంచలో ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గులపోటీ

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి జనవరి 6: సంక్రాంతి పండుగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాలముగ్గుల పోటీల్లో భాగంగా శనివారం భద్రాద్రి జిల్లా స్థాయి పోటీలు పాల్వంచ కేఎస్పీ రోడ్డులోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాస్థాయిలో అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల స్పాన్సర్‌గా వ్యవహరిస్తుండగా.. శనివారం ఉదయం 9గంటల నుంచి పోటీ నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ కార్యదర్శి జి. భానుమతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ తెలుగు సంస్కృతికి పట్టం కడుతోందన్నారు. వారు నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలు తెలుగు వారి సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఇంటి ముందు ముగ్గు వేయడం వల్ల ఆ ఇంటికి శుభం కలుగుతుందన్నారు. భవిష్యత్ తరాలకు ఈ ముగ్గుల పోటీలు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. ప్రతి ఒక్క మహిళ తెల్లవారుజామున తప్పనిసరిగా తమ ఇంటి ముందు ముగ్గులు వేయాలన్నారు. మహిళలు వేకువజామునే వంగి ముగ్గులు వేయడం వల్ల వారికి శారీరక వ్యాయామం జరుగుతుందన్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ యాజమాన్యం, అనుబోస్ విద్యా సంస్థల యాజమాన్యాన్ని జడ్జి అభినందించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మరో అతిథి పాల్వంచ పెద్దమ్మగుడి ఆలయ ఈవో రజినికుమారి మాట్లాడుతూ పాశ్చాత్య ధోరణిలో సాగుతున్న నేటి సమాజంలో ఇలాంటి ముగ్గుల ద్వారా మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీయడం అభినందనీయమన్నారు. మరో అతిథి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష మాట్లాడుతూ ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. అనుబోస్ విద్యా సంస్థల ఛైర్మన్ భరత్ కృష్ణ, ఆయన సతీమణి అవని మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా తమ విద్యా సంస్థలో ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ వారి సౌజన్యంతో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. తమ కళాశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీ పట్ల ఆసక్తి చూపిన మహిళలు, విద్యార్థినులకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దుద్దుకూరి రామారావు మాట్లాడుతూ ఈ ముగ్గుల పోటీలో 150మంది మహిళలు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహ బహుమతులు అందజేసిన ముక్తేవి ట్రస్టు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ముగ్గులపోటీ సందర్భంగా అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో భోగిమంటలు వేశారు. పిల్లలకు భోగి పళ్లు పోశారు. సంక్రాంతి విశిష్టతను చాటే పిండి వంటకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. పాలు పొంగళి తయారు చేసి పతంగులు ఎగుర వేసి సంక్రాంతి సందడి చేశారు. ఉదయం 11గంటలకు అనుబోస్ విద్యాసంస్థల ఛైర్మన్ భరత్ కృష్ణ సతీమణి అవని ముగ్గు వేసి ప్రా రంభించారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ రిపోర్టర్లు అబ్బూరాం, కళ్లోజి శ్రీనివాస్, లెనిన్, తారక్, సురేష్, పుల్లారావు, జీవి నరసింహారావు, ఉదయ్, పాపారావు, రవి, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి పొందడం సంతోషంగా ఉంది

ఎం. నీరజ, కొత్తగూడెం(ప్రథమ విజేత)

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' వారు నిర్వహించిన ఈ ముత్యాల ముగ్గుల పోటీలలో తనకు ప్రథమ బహుమతి లభించడం ఎంతో సంతోషంగా ఉంది. గత కొన్నేళ్ల నుంచి ప్రతి ఏడాది ఈ పోటీల్లో తాను పాల్గొంటున్నా. ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి అభినందనలు..

మా ప్రతిభను వెలికితీసేందు ఈ పోటీలు ఉపయోగపడ్డాయి

కె నవ్య, కొత్తగూడెం (ద్వితీయ విజేత)

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ముగ్గుల పోటీలు మహిళలలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడ్డాయి. నాకు ద్వితీయ బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి సంవత్సరం ఈ ముగ్గుల పోటీలలో పాల్గొంటున్నాను.

నేడు ఖమ్మంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాలముగ్గుల పోటీ

భక్తరామదాసు కళాక్షేత్రంలో కార్యక్రమం

ఖమ్మం సాంస్కృతికం: సంక్రాంతి పండుగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాలముగ్గుల పోటీల్లో భాగంగా ఆదివారం ఖమ్మం జిల్లాస్థాయి పోటీలు నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు జిల్లాస్థాయి స్పాన్సర్‌గా శ్రీబాలాజీ రియల్ఎస్టేట్స్ వ్యవహరిస్తోంది. ఈ పోటీలో మహిళలు మాత్రమే పాల్గొనాల్సి ఉంది.


కె.నవ్య, ద్వితీయ బహుమతి విజేత


సీహెచ్.సుజాత, తృతీయ బహుమతి విజేత


మాట్లాడుతున్న కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి

ముగ్గుల పోటీల విజేతలు వీరే..

పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి కొత్తగూడెం పట్టణానికి చెందిన ఎం. నీరజ, ద్వితీయ బహుమతి కొత్తగూడెం పట్టణానికి చెందిన కె.నవ్య, తృతీయ బహుమతి కొత్తగూడేనికి చెందిన సీహెచ్.సుజాత బహుమతులు గెలుపొందారు. వీరితోపాటుగా ఐదు కన్సోలేషన్ విజేతలు నవభారత్‌కు చెందిన కె.శైలజ, పాల్వంచకు చెందిన ఆర్.సంధ్య, పాల్వంచ పట్టణానికి సీహెచ్ రాజ్యలక్ష్మి, పా ల్వంచ పట్టణానికి చెందిన పి. స్వర్ణ, కొత్తగూడెం పట్టణానికి చెందిన ఆర్ఎల్ స్రవంతిలు బహుమతులు పొందారు.

ఎన్ని అడ్డంకులొచ్చినా
ఆరు గ్యారంటీలు అమలుచేస్తాం

- నెలరోజుల్లోనే హామీలన్నీ అమలు చేయలేదనడం హాస్యాస్పదం
- ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలిస్తాం
- ఎర్రుపాలెం ప్రజాపాలన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం, జనవరి 6: ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఎన్ని అడ్డంకులు వచ్చినా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హామీలు అమలు కాకూడదనే ప్రతిపక్షాల ఆలోచనను నిజం కానివ్వబోమన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులోని ప్రభుత్వ కళాశాలలో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కాకుండానే ఆరుగ్యారంటీలు అమలుచేయడంలో విఫలమయ్యారని ప్రతిపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల పాలనలో ఏ పనులు చేయకుండా ప్రజల చేత వాతలు పెట్టించుకొని అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పందంగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీచేసి, భవిష్యత్ తరాలను తాకట్టుపెట్టి రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టివేసిందని ధ్వజమెత్తారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో తమ బతుకులు మారుతాయని కలలు కన్న ప్రజలు కలు కల్లలు చేశారన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధిగమించి ఒకటవతేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన ఘతన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. గత ఐదేళ్లలో ఏ రోజూ ఒకటో తేదీన ఉద్యోగులకుజీతాలు ఇవ్వలేదన్నారు. గత ఎన్నికల్లో కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాలా? అని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారని, కానీ ప్రజలు వారికి చెంపపెట్టులా కరెంటూ, కాంగ్రెస్సు రెండో కావాలని తీర్పు ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు 24గంటలు పాటు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇంటర్నేషనల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యాతోపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ తదితర నాయకులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న భట్టి

మామునూరులో సమీక్ష

ఎర్రుపాలెం మండలంలోని మామునూరులో సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులతో మధిర నియోజకవర్గానికి తాగు, సాగునీటి సరఫరా, ఇందిరమ్మ డైరీ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలపై పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ముదిగొండ మండలానికి జీళ్లచెరువు డబ్ల్యూటీపీ నుంచి చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు, మధిర మునిసిపాలిటీకి ముక్రీ హిల్స్ డబ్ల్యూటీపీ నుండి తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నియోజకవర్గ సాగుభూమికి నీటి సరఫరాపై దృష్టిపెట్టాలన్నారు. కట్టలేరు కుడి, ఎడమ కాల్వల మిగులు పనులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జాలిముడి ప్రాజెక్టు పనులు పూర్తిచేయలేదని, నిర్వహణ చేయడంలేదన్నారు. ఇంకా చెల్లించాల్సిన బిల్లులు ఉంటే నిలిపేయాలన్నారు. ఇందిరమ్మ డైరీ పథకానికి కార్యాచరణ చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సమస్యలు అధిగమిస్తామని అన్ని ఆవాసాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ డైరీపై సంబంధిత శాఖలు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ చేస్తామన్నారు. అనంతరం పేట చెరువును భట్టి పరిశీలించారు. సమావేశంలో సీపీ సునిల్‌దత్, మిషన్‌భగీరథ సీఈ కె.శ్రీనివాస్, ఎస్ఈ సదాశివకుమార్, ఇరిగేసన్ ఎస్ఈ ఆనంద్‌కుమార్, ఈఈ రామకృష్ణ, డీఆర్డీవో విద్యాచందన, ఎర్రుపాలెం ఎంపీపీ శిరీష, జడ్పీటసీఈ శీలం కవిత, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న భట్టి

ఇల్లెందులో
బీఆర్ఎస్ హరి

- గులాబీ పార్టీలో నేతలు, క్యాడర్ చెల్లాచెదరు
- హరిప్రియకు ఇన్‌చార్జ్ బాధ్యతలూ వద్దంటున్న పార్టీ శ్రేణులు
- మాజీ ఎమ్మెల్యే భర్త వ్యవహారశైలితో పార్టీ ఉనికికి ముప్పు



ఇల్లందు, జనవరి 6: ఇల్లెందు నియోజకవర్గంలో బీర్ఆర్ఎస్ ఉనికి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన బానోత్ హరిప్రియ ఘోర పరాజయానికి ఆమె భర్త హరిసింగ్ ప్రధాన కారణమని నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. ఆయన చర్యల మూలంగానే హరిప్రియ ఓటమి పాలైందని ఆరోపిస్తున్నారు. పలు మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే భర్తపై ఇప్పటికే పార్టీ న్యాయకత్వానికి ఫిర్యాదులు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా కనీసం పోలింగ్‌బూతుల్లో ఏజంట్లను పెట్టలేని దయనీయస్థితికి పార్టీని దిగజార్చారని, అలాంటిది మళ్లీ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా హరిప్రియకు బాధ్యతలు అప్పగించడం ఆత్మహత్యాసదృశ్యమని నియోజకవర్గంలోని పలువురు నాయకులు బీఆర్ఎస్ నాయకత్వాన్ని కోరుతున్నట్లు తెలిసింది. 11న బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ పరిధి సమీక్ష సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ పనితీరుతోపాటు ఆమె భర్త హరిసింగ్ నిర్వాకాలనూ రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లేందుకు పలువురు సమాలోచనలు చేస్తున్నారు. అనేక మంది నాయకులు, పార్టీ శ్రేణుల భవిష్యత్తును దెబ్బతీసిన హరిసింగ్ పార్టీలో కొనసాగితే తాము కొనసాగడం సాధ్యం కాదని పలువురు నాయకులు పేర్కొనడం గమనార్హం.

సొంత పార్టీ నేతలకే ఎసరు పెట్టిన వైనం..

మాజీ ఎమ్మెల్యే హరిప్రియ భర్త హరిసింగ్ నిర్వాకాలపై గత ఏడాది కాలంగా నియెజకవర్గంలోని గులాబీ నేతల్లో తీవ్ర వ్యవతిరేగత ఏర్పడింది. తనకు గిట్టని బీఆర్ఎస్ నాయకులనే ఆయన టార్గెట్ చేయడం, తన చెప్పుచేతుల్లో ఉండేవారికే పదవులు కట్టబెట్టిన విషయాలను స్థానిక నాయకులు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినా పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సింది వచ్చిందని పలువురు వాపోయారు. మున్సిపల్‌ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావును తొలగించి ఛైర్మన్ పదవి ఒక లిక్కర్ వ్యాపారికి కట్టబెట్టేందుకు సొంత పార్టీ కౌన్సిలర్లకు రూ.10లక్షల చొప్పున ముడుపులు ఇప్పించారన్న విషయం పార్టీ రాష్ట్ర నేతల ముందే బట్టబయలైన విషయం తెలిసిందే. హరిసింగ్ డబ్బుకోసం దేనికైనా తెగించి పార్టీకి నష్టం చేకూరుస్తున్నారని ఇల్లెందు, బయ్యారం, గార్ల, కామేపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు పార్టీ అధిష్టానానికి వివరించినా వారినే టార్గెట్ చేయడంతో నియోజకవర్గంలో గులాబీ కీలక నేతలంతా కాంగ్రెస్‌లో చేరిపోయారు. అంతేగాక పార్టీ క్యాడర్ సైతం భారీగా కాంగ్రెస్‌లో చేరడంతో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సైతం పేలవంగానే సాగింది. ఇల్లెందు నియోజకవర్గం ఎన్నికల చరిత్రలో ఒక్క అధికార పార్టీ కనీసం పోలింగ్ ఏజంట్లను కూడా పెట్టుకోలేని స్థితికి చేరుకుందని పలువురు పార్టీ నాయకులు వాపోతున్నారు. తుదకు పోల్ మేనేజిమేంట్ చేసే సత్తా కలిగిన నాయకులను కూడా లేకుండా చేయడం, అన్నితానై వ్యవహరించడంతో ఎన్నికల్లో ఓటమికి హరిసింగ్ ప్రధాన బాధ్యుడంటూ నాయకులు ధ్వజమెత్తుతున్నారు. ఆయన దందాలు, గిట్టనివారిపై వేదింపులు పెచ్చుమీరడం, భర్త ఆగడాలను అడ్డుకునేందుకు హరిప్రియ ఎలాంటి చొరవ చూపకపోవడం మూలంగానే కాంగ్రెస్‌కు ఇల్లెందులో 57వేల ఓట్ల ఆధిక్యం లభించిందని పేర్కొన్నారు.

పార్టీ నిధులు ఏమయ్యాయి?

ఎన్నికల్లో ప్రచారాలు, పార్టీ గెలుపుకోసం బీఆర్ఎస్ నాయకత్వం సమకూర్చిన, కోట్ల రూపాయలు ఏమయ్యయని క్యాడర్ నిలదీస్తుండటం గమనార్హం. నియోజవర్గానికి సుమారు రూ.30 కోట్లు పార్టీ నిధులు అందించినా పోల్ మేనేజ్‌మెంట్‌లో ఘోరంగా విఫలం కావడం చర్చనీయంశమైంది. పార్టీ పంపిన ఎన్నికల డబ్బును సైతం ఖర్చు చేయలేదని విరుచుకుపడుతున్నారు. ఎన్నికల్లో ఓటమిపాలు కావడంతో పార్టీ క్యాడర్ తీవ్రవైరాశ్యంలో కురుకుపోయినా మాజీ ఎమ్మెల్యే దంపతులు మండలాలు, గ్రామాలు సందర్శించి మనోధైర్యం కల్పించకపోవడం గమనార్హం. ఓట్ల లెక్కింపునాటి నుంచి పార్టీ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోవడం, కొన్ని ఏరియాల్లో ఎన్నికల ఖర్చు కూడా ఇవ్వకుండా మొఖం చాటేస్తుండటంతో బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమంటున్నారు. తుదకు పోలింగ్ మురిసిన పిదప కూడా వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన నాయకులు, ఓటర్లు, డబ్బుల కోసం ఇల్లెందు క్యాంపు కార్యాలయానికి వచ్చి ఆందోళనలు చేశారు. ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా బకాయిలు చెల్లించకుండా ఫోన్లు ఎత్తకుండా కాలం వెళ్లబుచ్చుతుండటంతో అనేక మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ గూటికి తరలివెళుతున్నారు. హరిసింగ్ మూలంగా తమ రాజకీయ భవిష్యత్ అగమ్యచరంగా మారిందని తల్లడిల్లుతున్నారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ దంపతుల పనితీరు, వారు అనుసరిస్తున్న వైఖరి మూలంగా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, అయినా నియోజకవర్గం ఇన్‌చార్జ్ బాధ్యతలు మళ్లీ వారికే ఏలా ఇస్తారని పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.

ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు

- ప్రశాంతంగా ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- ఖమ్మం జిల్లాలో 4,88,316.. భద్రాద్రిలో 3,70,015 అర్జీలు
- ఆన్‌లైన్‌లో నమోదు ప్రారంభం

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, జనవరి 6:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన గ్రామసభలు శనివారంతో ముగిశాయి. గత ఎనిమిది పనిదినాలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించారు. ఇందిరమ్మ అభయహస్తం ఆరు గ్యారెంటీ స్కీంలకోసం ఖమ్మం జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో శనివారం సాయంత్రం వరకు మొత్తం 4,88,316 దరఖాస్తులు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమాన్ని ఖమ్మం నగరంలో డిసెంబర్ 28 వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించగా రఘునాథపాలెం, ఖమ్మం మునిసిపాలిటీలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. పాలేరు నియోజకవర్గంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ప్రజాపాలనలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం ఎనిమిది పనిదినాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని 714పంచాయతీ, మునిసిపల్ వార్డుల్లో గ్రామసభలను నిర్వహించారు. మొత్తం 4,71,425 కుటుంబాలు ఈ సభల్లో పాల్గొన్నారు. ఐదు గ్యారెంటీ పథకాల్లో భాగంగా 4,88,316 దరఖాస్తులు ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు అధికారులకు అందించారు. ఖమ్మం జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో నోడల్ అధికారిగా వ్యవసాయశాఖ కమిషనర్ ఎం. రఘునందన్‌రావు నియమితులవ్వగా ఆయన కూడా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాన్ని పర్యవేక్షించి సంతృప్తిని వ్యక్తంచేశారు. రేషన్‌కార్డులు, కౌలురైతులు, దళితబంధు వంటి పథకాల కోసం 61,536 దరఖాస్తులు అందించారు. వారం రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కౌంటర్ల ఏర్పాటు, ఇంటింటికీ తిరిగి ప్రజలకు దరఖాస్తులు ఇవ్వడంలో అధికారులు సఫలమయ్యారు. ఇప్పటి వరకు తీసుకున్న ప్రతి దరఖాస్తును ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. పథకాల వారీగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియను సంక్రాంతి లోగా పూర్తి చేయాలని నిర్ధేశించుకున్నారు. దానికి తగినట్లుగా జిల్లాలో 1000 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మొత్తం 585 గ్రామ పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల్లోని 3,22,501కుటుంబాలనుంచి మొత్తం 3,70,015 దరఖాస్తులు స్వీకరించారు. చివరిరోజు వరకు అందిన మొత్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం మొదలు పెట్టారు. జనవరి 13 నాటికి మొత్తం దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు.

భద్రాద్రి జిల్లా ఎస్పీగా రోహిత్‌రాజ్
బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రోహిత్ రాజ్


రోహిత్‌రాజ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఎస్పీ డా.వినీత్

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి జనవరి 6: భద్రాద్రి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమితులైన బిరుదురాజు రోహిత్‌రాజ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రోహిత్‌రాజు లక్ష్మీదేవిపల్లి మండలంలో ట్రైనీ ఎస్పీగా పని చేసి భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వహించారు. ఏఎస్పీగా పని చేస్తూ పదోన్నతిపై గ్రేహౌండ్స్‌కు బదిలీపై వెళ్లి అక్కడినుంచి గత నవంబర్‌లో హైద్రాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా నియమితులు కాగా, ప్రస్తుతం ఎస్పీగా పని చేస్తున్న డా. వినీత్ మాదాపూర్ డీసీపీగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇద్దరు అధికారులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బదిలీపై వెళ్తున్న వినీత్‌కు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వీడ్కోలు సభ నిర్వహించి పూలమాలలతో సత్కరించారు.



ఆట మొదలైంది

- అశ్వారావుపేటలో జోరుగా కోడిపందాలు
- దండిగా దండుకుంటున్న నిర్వాహకులు
- పోలీసులకు దొరకకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- రోజుకో చోట పందాలు నిర్వహిస్తున్న తీరు



అశ్వారావుపేట రూరల్, జనవరి 6: సాధారణంగా కోడిపందాలు అంటే సంక్రాంతి పర్వదినాన రెండు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. అదీనూ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అనధికారికంగా నిర్వహిస్తారు. కానీ తెలంగాణాలో అయితే అది కూడా ఉండదు. కోడి పందాలు, ఇతర జూదాలపై తెలంగాణా ప్రభుత్వం పూర్తిగా నిషేధం విధించింది. అయితే ఆంధ్రాను ఆనుకుని ఉండే అశ్వారావుపేటలో మాత్రం కొందరు కోడి పందాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కోడిపందాలకు అనుమతులు తీసుకున్నామంటూ కొందరు నిర్వాహకులు వివిధ ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లను పిలిపించి దండిగా దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మామిడి తోటలు..అటవీ ప్రాంతాల్లో

అశ్వారావుపేట మండలంలోని అనేక ప్రాంతాల్లో ఏటా కోడిపందాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే. కొందరు తోటల్లో, అటవీ ప్రాంతాలలో నిర్వహించారు. పండుగకు వీటిని మరింతగ విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. మండలంలోని ఆసుపాక, గుమ్మడివల్లి, తిరుమలకుంట, జమ్మిగూడెం, దురదపాడు, నారంవారిగూడెం, గాండ్లగూడెం, నారాయణపురం, గుమ్మడపల్లి, అనంతారం తదితర గ్రామాలలో పందాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల జరిగిన పందాలలో రూ.10వేల నుంచి రూ.50వేల వరకు పందాలు కాసి బిర్రుల పేరుతో భారీగ వసూళ్ళకు పాల్పడినట్లు సమాచారం. దీంతోపాటు కోడిపందాలు వద్ద నిర్వాహకులు గుండాట, పేకాటను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి కూడా నిర్వాహకులు భారీగానే వసూళ్లకు పాల్పడుతున్నారు. అనేకమంది పూర్తిగా కోడిపందాలు, పేకాటకు పరిమితమై కుటుంబాలను నాశనం చేసుకుంటున్న సంఘటనలు అనేక నిత్యం చూస్తూనే ఉన్నాం. నిర్వాహకులు పోలీసులకు పట్టుబడకుండా రోజుకో చోట పందాలు నిర్వహిస్తున్నారు. ముందస్తు సమాచారం కోసం కొందరు కొరియర్‌లను ఏర్పాటు చేసుకుంటూ ఎప్పటికప్పుడు పోలీసులు వస్తే సమాచారం ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పందెలు జరగకుండా చర్యలు: ఎస్‌ఐ శ్రీకాంత్

మండలంలో కోడిపందాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రోజూ గ్రామాల్లో సిబ్బందిని తిప్పుతున్నాం. ప్రతిగ్రామంలోనూ సమాచార వ్యవస్థను పెంచుకుని దాడులు జరుపుతాం. ప్రజలు కూడా ఎక్కడ కోడి పందాలు వేసినా వెంటనే సమాచారం అందిస్తే దాడులు చేస్తాం. కోడిపందాలు జరగకుండా నిఘాను పెంచుతాం.



పందెంలో కత్తులు దూసుకుంటున్న పుంజులు



కోడిపందేల బిర్రుల వద్ద ఏర్పాటు చేసిన గుండాట

రెండు మండలాల రెవెన్యూ గ్రామాలతో
అధికారుల తంటాలు



20వ వార్డు ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన మహిళలు



వైరా, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన నేపథ్యంలో వైరా మునిసిపాలిటీలోని రెండు మండలాల రెవెన్యూ గ్రామాలతో అధికార యంత్రాంగం సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైరా మునిసిపాలిటీ వైరా, కొణిజర్ల మండలాల పరిధిలో ఉంది. ఈ మునిసిపాలిటీలోని 20 వార్డులు ఆరు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్నాయి. వైరా మండలంలోని బ్రాహ్మణపల్లి అగ్రహారం, సోమవరం రెవెన్యూ గ్రామాల పరిధిలో 13వార్డులు పూర్తిగా, ఒక టోవార్డు కొంతమేర ఉన్నాయి. ఇక 15 నుంచి 20వ వార్డు వరకు అంటే ఆరు వార్డులు పూర్తిగా, ఒకటో వార్డులో కొంతభాగం కొణిజర్ల మండలం లోని దిద్దిపూడి, పల్లిపాడు, శివారు వెంకటాపురం, గుండ్రాతిమడుగు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్నాయి. మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో కూడా వైరా మండల యంత్రాంగమే ప్రజా పాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. ఒకటోవార్డులోని బీసీ కాలనీ కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు పరిధిలో ఉండగా, 15, 16, 17, 18 వార్డులు దిద్దిపూడి, పల్లిపాడు రెవెన్యూ గ్రామాల్లో, 19వ వార్డు శివారు వెంకటాపురం రెవెన్యూలో, 20వ వార్డు గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలో ఉంది. మునిసిపాలిటీ పరిధిలో ప్రజాపాలన కింద కొణిజర్ల మండల పరిధిలోని వార్డుల్లో దరఖాస్తులు తీసుకున్న అధికారులు అమలు చేసే సమయంలో తిరిగి మళ్లీ కొణిజర్ల మండల అధికారుల సహకారాన్ని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా కొత్త రేషన్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంది. కొణిజర్ల మండలంలో ఉన్న రెవెన్యూ గ్రామాల్లోని ప్రజల రేషన్ అవసరాలు మొత్తం అక్కడ రెవెన్యూ యంత్రాంగమే కొత్తరేషన్‌కార్డులు మంజూరు కోసం కొణిజర్ల రెవెన్యూ అధికార యంత్రాంగం సహకారం అవసరముంటుంది. ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్, గృహజ్యోతి ఇతర స్కీంల లబ్ధిదారుల ఎంపిక కూడా కొణిజర్ల మండల అధికారులు మునిసిపాలిటీ అధికారులకు రికార్డులు ఇతరత్రా తోడ్పాటు నివ్వాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంది. భవిష్యత్‌లో కూడా ఈ సమస్య అనేక పథకాల అమలులో ఇబ్బందికరంగా ఉండే పరిస్థితి ఉంది.

నీలాకాశంలో
ఎర్రటి సూరీడు



చీకటి తెరలు తామరతంపరగా తొలగిపోతున్నాయి. అప్పటి దాకా పరుచుకున్న మంచు క్రమంగా మాయమవుతోంది. పక్షుల కిలకిలరావాలు వినసొంపుగా వినిపిస్తుండగా.. ఆకాశంలో ఎర్రటి బంతిలా సూరీడు కన్పించాడు. ఉషోదయాన్ని అత్యంత అందంగా ప్రతిబింబించాడు. ప్రకృతికి మరింత రమణీయతను తీసుకొచ్చాడు. వైరాలో శనివారం కన్పించిన ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది. -వైరా

గోల్డ్‌షాప్ ఎదుట బాధితుల ఆందోళన

బాధితులపై షాపు యజమాని దాడి: ఒకరికి గాయాలు



సంఘటనా స్థలంలో విచారణ నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాము

పాల్వంచ, జనవరి 6: గోల్డ్‌షాప్ ఎదుట బాధితులు ఆందోళన దిగడంతో సహించలేక షాపు యజమాని వారిపై దాడి చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే యజమాని జరిపిన దాడిలో బాధితుల పక్షాన ఓ వ్యక్తి గాయాలపాలవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఈ ఘటన పాల్వంచలో సంచలనం రేకెత్తించింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన కొంచాడ కృష్ణ దంపతులు ఆభరణాలు తరుగు లేకుండా చేస్తానని నమ్మించడంతో తమకు పరిచయమున్న ఓ గోల్డ్‌షాపు యజమానికి రెండు సంవత్సరాల క్రితం రూ.40 లక్షలు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఆ నగలు వారికి అందలేదు. ఒక సంవత్సరం గడిచిన తరువాత సదరు వ్యాపారి వైఖరిని నిరసిస్తూ స్వయానా అతని తల్లిదండ్రులు అదే షాపు ఎదుట నిరసనకు దిగారు. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఈ విషయం తెలిసిన తరువాత కొంచాడ కృష్ణ దంపతులు వెళ్లి తమ బంగారు ఆభరణాలు ఇవ్వాలని రాముపై ఒత్తిడి చేయగా వారికి పెద్దల సమక్షంలో బాండు పేపర్లపై అగ్రిమెంట్ రాసిచ్చాడు. అనంతరం ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కించమని ప్రాధేయపడగా మరోసారి కృష్ణ దంపతులు అతడికి మరో రూ.35 లక్షలు అప్పుగా ఇచ్చారు. అవి తిరిగి ఇవ్వమంటే రాము వారికి నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వసాగాడు. అనేక సార్లు పోలీసుల దృష్టికి కూడా ఈ విషయం వెళ్లినట్లుగా తెలుస్తున్నది. అయినా ఫలితం లేకపోవడంతో శనివారం సాయంత్రం రాము షాపునకు వెళ్లి డబ్బులివ్వమని నిలదీశారు. ప్రతిగా రాము వారిపై ఎదురు దాడికి దిగాడు. దుర్భాషలాడి కృష్ణ, అతని బంధువులపై అద్దాలతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కృష్ణ బావమరిది సంతోష్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పాల్వంచ టౌన్ ఎస్‌ఐ రాము సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ జరిపి ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేయాల్సి ఉందని తెలిపారు.

అటవీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న అటవీ రేంజ్ అధికారి ప్రసాద్‌రావు

జూలూరుపాడు, జనవరి 6: గ్రామాలలో ఎవరైనా వ్యక్తులు అటవీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జూలూరుపాడు అటవీ రేంజ్ అధికారి ప్రసాద్ రావు హెచ్చరించారు. శనివారం మండలంలోని నల్లబండబోడు గ్రామంలో అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను వేటాడడం, చెట్లను నరకడం, సేద్యం కోసం పోడు నరికినట్లు అయితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నేరాలకు పాల్పడితే విధించే చట్టాలు, శిక్షల గురించి వారికి తెలియజేశారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ ముక్తి నరసింహారావు డీఆర్వో లక్ష్మీనర్సు, ఎఫ్‌డివోలు డి.కిషన్, జె.కిషన్, పలువురు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లారీ పై నుంచి పడి కూలీ మృతి

దుమ్ముగూడెం, జనవరి 6: లారీ డ్రైవరు నిర్లక్ష్యంతో పత్తి లోడింగు పనులకు వెళ్లిన కూలీ మృతిచెందాడు. ఈసంఘటన శనివారం మండలంలో జరిగింది. భద్రాచలం తుమ్మలనగరానికి చెందిన పేరాల శేఖర్(35) సరిహద్దు ఏపీ రాష్ట్రం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఎప్పటిలానే తోటి కూలీలతో కలిసి పత్తి లోడింగుకు వెళ్లాడు. శేఖర్ లారీ క్యాబిన్‌పై కూర్చొని ఉండగా, మరి కొందరు కూలీలు క్యాబిన్ లోపల కూర్చున్నారు. డీసీఎం మినీలారీ డ్రైవరు కేత నాగరాజు చెరుపల్లి మూలమలుపు వద్ద వాహన వేగాన్ని తగ్గించకుండా నిర్లక్ష్యంగా తిప్పడంతో పైన కూర్చొని ఉన్న శేఖర్ లారీ వెనుక చక్రాల కింద పడ్డాడు. దీంతో అతడి రెండుకాళ్లు నుజ్జయి తీవ్ర రక్తస్రావంతో మృతిచెందాడు. డ్రైవరు నిర్లక్ష్యం, అతివేగం వలనే ప్రమాదం జరిగిందని మృతుని భార్య అంజలి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ పోస్టుమార్టం చేయొద్దని తోటికూలీలు, మృతుని బంధువులు భద్రాచలం పోస్టుమార్టం కేంద్రం వద్ద నిరసనకు దిగారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుండాల, జనవరి 6: ప్రయాణానికి డబ్బులు ఇవ్వలేదని మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని రోళ్లగడ్డ గ్రామానికి చెందిన సనప నాగేశ్వరరావు(45) శనివారం ఉదయం పస్రా వెళ్లేందుకు భార్యను చర్జీలకు డబ్బులు కావాలని అడగగా మద్యం తాగి ఉన్నావు డబ్బులు ఇవ్వడం కుదరదు అనడంతో మనస్థాపం చెంది. మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే గుండాల ఆసుపత్రికి తీసుకువస్తుండగా మర్గమధ్యలోనే మృతి చెందాడు. గుండాల పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు తరలించారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

పెనుబల్లి, జనవరి 6: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. నాలుగువేల నగదు, ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటన పెనుబల్లి మండల పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెనుబల్లి మండల పరిధిలోని మందాకిన నర్సరీ వెనుక ఉన్న కట్టపై కొందరు పేకాట ఆడుతున్నారు. ఈ సమాచారం తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు.అనంతరం వారి వద్ద నుంచి నాలుగువేల నగదు, ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి పేకాటరాయుళ్లు పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులం సెల్ ఏవో నరేందర్ సస్పెన్షన్

భద్రాచలం, జనవరి 6: భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని గురుకులం సెల్ లో ఏవో గా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేందర్ ను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు కుట్టించేందుకు టెండర్‌ను ఆహ్వానించడంలో జాప్యం చేసినందుకు శాఖా పరంగా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

పేలిన లారీ టైర్: తప్పిన పెనుప్రమాదం



ప్రమాద స్థలం వద్ద గుమిగూడిన జనం

వైరా, జనవరి 6: వైరాలోని క్రాస్‌రోడ్డు వద్ద లారీ టైర్ పేలిపోయి త్రుటిపాట్లో పెనుప్రమాదం తప్పిపోయింది. తల్లాడ నుంచి వైరా వైపు వస్తున్న ఒక లారీ వెనుక టైర్ పగిలిపోయి ఆధాటికి రోడ్డుపైనున్న కంకరరాళ్లు పక్కనున్న దుకాణాల్లోకి దూసుకెళ్లాయి. ఒక ఆటోమొబైల్ ముందున్న ట్యూబ్‌లైట్లకు కంకరరాళ్లు తగిలి ధ్వంసమయ్యాయి. అలాగే లారీ వెనుక నుంచి వస్తున్న మరో డీసీఎం వాహనానికి రాళ్లు తగలడంతో డ్రైవర్ ముందుభాగంలో ఉన్న అద్దాలు ధ్వంసమయ్యాయి. అయితే దూసుకెళ్లిన కంకరరాళ్లు రోడ్డుపక్కన ఉన్న జనానికి తగలకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

విద్యార్థులకు కాలం చెల్లిన బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ



టీసీ క్లాస్‌లో తమకు కాలం చెల్లిన బిస్కెట్ ప్యాకెట్ పంపిణీ చేశారని చెబుతున్న 5వ తరగతి విద్యార్థిని సుహాన

జూలూరుపాడు, జనవరి 6: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కాలం చెల్లిన బిస్కెట్ ప్యాకెట్‌లను ఉపాధ్యాయులు పంపిణీ చేసిన సంఘటన శనివారం జూలూరుపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో టీసీ క్లాస్‌ను ఏర్పాటు చేయడంతో పంచాయతీ పరిధిలోని కోయకాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ, 5వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్యాంశాన్ని చెప్పిన తువాత రౌండ్ స్టార్ బిస్కెట్ ప్యాకెట్‌లను అందించారు. కొంతమంది విద్యార్థులు ఆ బిస్కెట్ ప్యాకెట్‌లను ఇంటికి తీసుకెళ్ళారు. విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని పరిశీలించగా గడువు తీరినట్లు ఉంది. తమ పిల్లలకు కాలం చెల్లిన బిస్కెట్‌లను పంపిణీ చేశారని, అనారోగ్యానికి గురి అయితే బాధ్యత ఎవరిదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార తనిఖీ అధికారి జూలూరుపాడులోని దుకాణాలలో తనిఖీలు నిర్వహించకపోవడంతోనే వ్యాపారులు కాలం చెల్లిన వాటిని కూడా విక్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆ బిస్కెట్ ప్యాకెట్‌ల గడువు తీరింది తాము చూడలేదని, విద్యార్థులు ఎవరు అనారోగ్యానికి గురి కాలేదని, మరో సారి ఇలాంటి సంఘటన చోటు చేసుకోకుండా చూసుకుంటామని తెలిపారు.

పాతపాడు అడవిలో పెద్దపులి సంచారం

ఆందోళనతో పరుగులు తీసిన రైతులు
నేడు పులి పాదముద్రలు పరిశీలించనున్న అధికారులు

కరకగూడెం, జనవరి 6: మండలంలోని సమత్ మోతె పంచాయితీ గొడుగుబండ పరిధిలోని పాతపాడు అడవి ప్రాంతంలో శనివారం పెద్దపులి సంచరించిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులు శనివారం పత్తి చేనులో పత్తి తీసేందుకు సమీపంలోని అడవీ ప్రాంతానికి వెళ్లారు. ఆ పరిసరాల్లో పెద్దపులి అరుపులు రావడంతో ప్రజలు అక్కడ నుంచి ఆందోళనతో పరుగులు తీశారు. ఆ ప్రాంతంలో పెద్దపులి అడుగులు కూడా ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై అనంతారం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గోవింద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఈ విషయంపై మాకు ఎటువంటి సమాచారం అందలేదని, ఆదివాం ఉదయం అధికారులతో కలసి ఆ ప్రాంతంలో పరిశీలించి పెద్దపులి అడుగులను గుర్తిస్తామని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 8 టేకు దిమ్మెల పట్టివేత



దాడుల్లో పాల్గొన్న అటవీశాఖ సిబ్బంది

దుమ్ముగూడెం, జనవరి 6: దుమ్ముగూడెం హైడల్ పవర్ ప్రాజెక్టు వద్ద శనివారం తెల్లవారు జామున ఎనిమిది టేకు దిమ్మెలను డీఆర్వో శోభన్‌నాయక్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం నుంచి సేకరించిన టేకు దిమ్మెలను గోదావరి నదిపై పడవ ద్వారా అవతల ఒడ్డుకు స్మగ్లింగ్ చేసేందుకు గుర్తు తెలియని దుండగులు పవర్‌ప్లాంటు వద్దకు ఆటోలో తరలించారు. పక్కా సమాచారంతో అక్కడ కాపుకాసిన అటవీశాఖ సిబ్బంది ఒక్కసారిగా ఆకస్మిక దాడులు చేయడంతో ఆటోతో సహా మూడు ద్విచక్రవాహనాలను వదిలి దుండగులు పారిపోయారు. టేకు దిమ్మెల తరలింపుకు వచ్చిన పడవ ఈ హడావుడిని చూసి వెనుదిరిగింది. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి, టేకు దిమ్మెలను భద్రాచలం రేంజి కార్యాలయానికి తరలించారు. టేకుదిమ్మెల విలువ సుమారు రూ70వేల వరకుంటుందని సమాచారం. దాడుల్లో సిబ్బంది సోడె రాజేష్, ఎం.వెంకటరత్నం, విజయ, భీముడు, జిసతీష్, పలువురు అధికారులున్నారు.

భవనం పై నుంచి పడి వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం, జనవరి 6: భవనం పై నుండి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం ఉదయం ఖమ్మం నగర శివారులో జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన పోలిపొంగు వెంకన్న(50), అతని భార్య బుచ్చమ్మ, కుమారుడు భానుచందర్‌లతో కలిసి నగర శివారులోని వెలుగుమట్ల ప్రాంతంలోని ఓఅపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం అపార్ట్‌మెంట్ మూడవ అంతస్థులో నీళ్ళు కొడుతూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు నగరంలోని ఓఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించడమే
ఎమ్మెస్ఎంఈ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సత్తుపల్లి , జనవరి 6 నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటమే లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దింటి సూర్య నారాయణ అన్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత, మహిళలు నైపుణ్యం ఉండి ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతకు, మహిళలకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించటమే సంస్థ లక్ష్యమన్నారు. దేశ వ్యాపితంగా అన్ని రాష్ట్రాల్లో ఉపాధి కల్పించేలా కేంద్ర మంత్రి నారాయణ తగిన ఆలోచనతో ఉన్నారని ఆయన తెలిపారు. అందుకు గాను తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలో కమిటీల ప్రక్రియ పూర్తియిందని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటి వైస్ చైర్మన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు మునిసిపాలిటీకి 'ఓడీఎఫ్++'



మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న కోరం కనకయ్య

ఇల్లందుటౌన్, జనవరి 6: ఇల్లెందు మునిసిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఎమ్మెల్యే కోరం కనకయ్య, మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఇల్లందు మునిసిపల్ కార్యాలయంలో ఓడీఎఫ్‌కు కృషి చేసిన కమిషనర్ నవీన్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అతహార్‌ను, సిబ్బందిని వారు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావళి, కౌన్సిలర్లు రవి, నవీన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఈశ్వరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి పీఏగా రాఘవరావు



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 6: పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పీఏగా కేవీకే రాఘవరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరును ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటి వరకు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌కు పీఏగా కొనసాగుతున్నారు. గతంలో ఆయన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఆయనకు పీఏగా పని చేశారు. తాజాగా మంత్రి పీఏగా నియమితులవ్వడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

సత్తుపల్లి, జనవరి 6: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సత్తుపల్లి ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జి ఆయేషా ఫరీన్ పిలుపు నిచ్చారు. శనివారం సత్తుపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రసంగించారు. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగహన కలిగి ఉండాలని కోరారు. నేర పూరితమైన సంఘటనలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని హితవు చెప్పారు. విద్యతో పేదరికాన్ని జయించవచ్చునని అన్నారు.

ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్ మాతృమూర్తికి పలువురి సంతాపం

తుమ్మల, నామ, పువ్వాడ ప్రగాఢ సానుభూతి

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 6: ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ కె.శ్రీనివాస్ మాతృమూర్తి కండ్లగుంట రంగనాయకమ్మ శనివారం కన్నుమూశారు. ఆమె మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ లోక్‌సభపక్షనేత నామ నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు సంతాపం ప్రకటించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. వీరే కాకుండా ఖమ్మం నగరానికి, జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు శ్రీనివాస్‌ను పరామర్శించారు. రంగనాయకమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ముగ్గుతొడిగిన అందం

- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన నారీమణులు
- అందమైన రంగవల్లులను అద్భుతంగా తీర్చిదిద్దిన మహిళలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి జనవరి 6: రంగు రంగుల ముగ్గులు మగువల ప్రతిభకు అద్దం పట్టాయి. హరివిల్లును తలపించేలా తీర్చిదిద్దిన రంగవల్లులు సంక్రాంతి శోభను ముందుగానే తీసుకువచ్చాయి. సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా మహిళలు తీర్చిదిద్ది న ముగ్గులు ఇలలో హరివిల్లును సాక్షాత్కరింపజేశాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహి స్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాలముగ్గుల పోటీల్లో భాగంగా శనివారం భద్రాద్రి జిల్లా స్థాయి పోటీలు పాల్వంచ కేఎస్పీ రోడ్డులోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణ పరిధిలోని ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు హాజరై తమలోని దాగి ఉన్న ప్రతిభను విభిన్నముగ్గులతో సాక్షాత్కరింపజేశారు. కుటుంబసభ్యులతో సహా ముగ్గుల పోటీలకు హాజరు కావడంతో పోటీలు జరిగిన ప్రాంతంలో ముందుగానే సంక్రాంతి పండగ సందడి కనిపించింది. విభిన్న రకాల ముగ్గులను మహిళలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముగ్గులతో పోటీలు జరిగిన ప్రాంతం సంక్రాంతి శోభను సంతరించుకుంది. పలువురు మహిళలు ముగ్గుల్లో మామిడి తోరణాలు, ఇళ్ల ముందు పశువుల సందడి, పసుపు రాసిన పూర్ణకుంభం, పాలు పొంగే సిరులు, నవ ధాన్యాలు, ప్రత్యేక పిండి వంటలు, చెరుకు గడలు, డూడూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు.. ఇలా పండగ శోభను ఉట్టిపడేలా తీర్చిదిద్దారు.


ద్వితీయ బహుమతి విజేత కె. నవ్య


తృతీయ బహుమతి విజేత సీహెచ్ సుజాత


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు


బొమ్మల కొలువును పరిశీస్తున్న జిల్లా న్యాయాధికారి భానుమతి


ప్రథమ విజేతకు బహుమతి అందిస్తున్న కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ భానుమతి


ద్వితీయ విజేతకు బహుమతి అందిస్తున్న అనుబోస్ విద్యా సంస్థల చైర్మన్ భరత్ కృష్ణ


తృతీయ విజేతకు బహుమతి అందిస్తున్న అనుబోస్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ అవని


అనుబోస్ కళాశాల విద్యార్థినుల నృత్యం


ముగ్గులకు రంగులద్దుతున్న మహిళలు


కె. శైలజ(నవభారత్), ఆర్ సంధ్య(పాల్వంచ), సీహెచ్ రాజ్యలక్ష్మి(పాల్వంచ) పి.స్వర్ణ(పాల్వంచ), ఆర్ఎల్ స్రవంతి(కొత్తగూడెం)లకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న అతిథులు


గాలిపటాలతో సందడి


భోగి మంట వేస్తున్న దృశ్యం


చిన్నారికి భోగిపండ్లు


ముత్యాల ముగ్గుల పోటీకి హాజరైన భద్రాద్రి జిల్లావాసులు



సెల్ఫీ పాయింట్


పొంగలి వండుతున్న యువతులు

సీసీఐ కొనుగోళ్లు నిలిపివేత

- దళారులను ఆశ్రయిస్తున్న పత్తి రైతులు

తల్లాడ, జనవరి 6: తల్లాడలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రంలో పత్తి కొనుగోళ్లు నిలిచాయి. పత్తిని విక్రయించేందుకు రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని కొణిజర్ల, వైరా, తల్లాడ మండలాల్లో రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు తల్లాడలోని జిన్నింగ్‌మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈమేరకు గత నవంబరు 20వతేదీన తల్లాడలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 2023-24 వానాకాలం సీజన్లో కొణిజర్ల మండలంలో 14,800ఎకరాల్లో, వైరాలో 3,200ఎకరాల్లో, తల్లాడ మండలంలో 4,211ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఎకరాకు సగటున పది క్వింటాళ్ల మేరకు పత్త దిగుబడులు వచ్చాయి. మూడు మండలాల్లో 22,211ఎకరాల్లో సాగుచేసిన పత్తి సుమారు 2.25లక్షల క్వింటాళ్ల మేరకు పత్తి దిగుబడులొచ్చాయి. కాగా ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రంలో సుమారు 26వేల క్వింటాళ్ల మేరకు పత్తిని కొనుగోలు చేయటం జరిగింది. ఇందులో రైతులతోపాటు కొందరు దళారీ వ్యాపారుల నుంచి కూడా పత్తిని కొనుగోలు చేశారు. మూడు మండలాల్లో వచ్చిన పత్తి దిగుబడుల్లో కేవలం పదోవంతు పత్తిని మాత్రమే సీసీఐ ద్వారా కొనుగోలు చేసినట్లయింది. రైతులు తమ పత్తిని విక్రయించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ప్రస్తుత తరుణంలో డిసెంబరులో 31వతేదీ నుంచి తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోళ్లు నిల్చిపోయాయి. వారంరోజులుగా పత్తిని విక్రయించేందుకు రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా సీసీఐ ఉన్నతాధికారులు స్పందించి పత్తి కొనుగోళ్లను పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రైతు బతుకు.. కరివేపాకు

- డిమాండ్ లేక తగ్గుతున్న విస్తీర్ణం



ఏన్కూరు, జనవరి 6: కరివేపాకు పంటకు గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లనుంచి సాగు చేస్తున్న రైతులకు ఏఈడాది చేదు అనుభవం ఎదురయింది. ఏన్కూరు మండలంలో సాగుచేసినపంటకు గతంలో పొరుగు రాష్ట్రాల్లో సైతం విపరీతమైన డిమాండ్ ఉండేది. హిమామ్‌నగర్, రేపల్లెవాడ, నాచారం, గార్లొడ్డు, జన్నారం తదితర గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో సాగుచేశారు ఈఏడాది సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక పోవడంతో కేవలం 50 ఎకరాల్లో మాత్రమే సాగుచేస్తున్నారు. ఎకరానికి రూ.20వేల వరకు పెట్టుబడికాగా, ఆదాయం రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వచ్చేది. ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసిన వ్యాపారుల వారి ప్రాంతాల్లోనే సాగు చేయడం మొదలుపెట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో రైతులు ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల్లో విక్రయిస్తున్నారు. ధర తగ్గడంతో క్రమేణా రైతులు సాగు విస్తీర్ణం తగ్గించారు.

ప్రభుత్వం రాయితీలు కల్పించాలి: వెనిగండ్ల శ్రీహరి, రైతు

కరివేపాకు సాగుచేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పించి ఆదుకోవాలి. కరివేపాకు ఉప ఉత్పత్తులు, పొడులు, పచ్చళ్ల తయారీ పరిశ్రమలను ఏర్పాటుచేస్తే విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పుడు రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. పరిశ్రమల స్థాపన ద్వారా పలువురికి జీవనోపాధి కలుగుతుంది.

పత్తి నిల్వలపై జర భద్రం


- షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలపై అప్రమత అవసరం


ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

ఖమ్మం వ్యవసాయం, జనవరి 6: పత్తి చేతికి వచ్చే ముందు, ఏరిన పత్తిని నిల్వ చేసినప్పుడు అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోకపోతే తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా గ్రామాల్లో నిండుగా తెల్లబంగారం నిల్వలు దర్శనమిస్తున్నాయి. రైతులు ఎంతో కష్టపడి పండించిన పత్తిని ఇండ్లు, ఇంటి సమీపంలో నిల్వ చేశారు. గతంలో పత్తి నిల్వలో సరైన అవగాహన లేక అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి పత్తితో పాటు ఇండ్లు దగ్ధమై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగాఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు..

పత్తిని నిల్వ చేసిన ప్రదేశంలో వేలాడుతున్న కరెంటు తీగలు లేకుండా చూసుకోవాలి. సేకరించిన పత్తిని ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలిస్తే మేలు. ఇంటికి తీసుకురాకుండా సాధ్యమైనంత వరకు ఆరు బయటనే నిల్వ చేయాలి కరెంటు తీగల సమీపంలో నిల్వచేయవద్దు. పత్తి నిల్వల వద్ద నేగళ్లు, చలి మంటలు వేయ కుండా చూసుకోవాలి. పత్తి నిల్వలకు పిల్లలను దూరంగాఉంచాలి. సిగరేట్, బీడి తాగే వారు సమీపంలో రాకుండా చూడాలి. పత్తిని లారీల్లో డీసీఎంలో లోడింగ్ చేసే ముందు గ్రామంలోని విద్యుత్ తీగల ఎత్తును చూసుకోవాలి. విద్యుత్ తీగల కింద నుంచి పత్తి తీసుకుని పోయేముందు జాగ్రత్తగా ఉండాలి. పత్తి నిల్వ చేసే ముందు అందుబాటులో నీటి వసతి తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. పత్తి నిల్వలపై ఎప్పటికప్పుడు కవర్లతో కప్పి ఉండేలా చూసుకోవాలి



నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలి: టీడీపీ

తిరుమలాయపాలెం, జనవరి6: పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలానికి నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేయాలని తెలుగుదేశం పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తిరుమలాయపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేదని, ఆనాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించారన్నారు. గతంలో టీడీపీ ఆధ్వర్యంలో వివిధరూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ఆసుపత్రిని 100పడకల వైద్యవిధానపరిషత్‌గా మార్చారని తెలిపారు. తిరుమలాయపాలెం మండలం భౌగోళికంగా పెద్దమండలం కావడంతో మండలానికి నర్సింగ్ కళాశల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నామాప్రసాద్, నాయకులు కొప్పుల వెంకటరావు, మల్లీడి రమేష్, మల్లీడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ స్కీంలను పక్కాగా అమలు చేస్తాం

- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాం
- పజలు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకోరావాలి
- సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్ నాయక్

సత్తుపల్లి, జనవరి 6 కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పని సరిగ్గా నెరవేరుస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి అన్నారు. శనివారం సత్తుపల్లిలోని నేతజీ రహదారి వైపున జరిగిన ప్రజా పాలన సభలో దరఖాస్తులను స్వీకరించారు. అర్హులందరికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకోరావాలని ఎమ్మెల్యే రాగమయి కోరారు. తిరిగి నాలుగు నెలల తరువాత ప్రజా పాలన కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ సుజాత, చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్మన్ తోట సుజాల రాణీ, గ్రంథాల చైర్మన్ కొత్తూరి ఉమామహేశ్వరరావు, సోసైటీ డైరెక్టర్ గాదే చేన్నారావు, కౌన్సిలర్స్ రాంబాబు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

వైరా: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ స్కీంలను నిర్ణీత గడువులోగా పక్కాగా అమలుచేసి తీరుతుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరా మునిసిపాలిటీ 20వ వార్డు పాత లంబాడ తండాలో శనివారం జరిగిన ప్రజాపాలన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి దివాళా తీయించిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కూడా కాకముందే కేసీఆర్ అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని ఆక్షేపించారు. తొమ్మిదిన్నరేళ్లగా ప్రజలకు బీఆర్ఎస్ ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. దివాళా తీసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఆరు గ్యారెంటీ స్కీంలను అమలుచేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కౌన్సిలర్ గుగులోతు లక్ష్మీబాయి, తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు, గిర్దావర్ శ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు బీక్యా, మచ్చా బుజ్జీ, హరి రమేష్ పాల్గొన్నారు.





దరఖాస్తు స్వీకరిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

మొరాయిస్తున్న సర్వర్

కొణిజర్ల: ప్రజాపాలన గ్రామసభలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు వైరా మునిసిపాలిటి పరిధిలోని 15వవార్డు మండలంలోని దిద్దుపుడిలో దరఖాస్తులను మునిసిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, మునిసిపల్ కమీషనర్ కరణాకర్, కౌన్సిలర్ గుడిపుడి సురేష్ దరఖాస్తులను స్వీకరించారు. మండల పరిధిలోని తనికెళ్ళలో చివరిరోజు దరఖాస్తులను ఎంపీడీవో మహాలక్ష్మీ స్వీకరించారు. మొత్తం 18534 దరఖాస్తులు వచ్చిన్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలానికి సంబంధించి ప్రజాపాలన దరఖాస్తులను స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు. సర్వర్ మొరాయిస్తుం డటంతో కొంతఇబ్బందులు తప్పటంలేదు. ఆన్‌లైన్ ప్రకియను మండల స్పెషల్ ఆఫీసర్ సుమా, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

తప్పులు దొర్లకుండా ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్

చింతకాని: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో తప్పుల దొర్లకుండా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీడీవో తెళ్లూరి శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన ధరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. సుమారు 20 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. నిర్ణిత గడువులోగా ధరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, సూపరిండెంట్ చేకూరి రాజ్యలక్ష్మీ, కార్యదర్శులు షేక్ సైదులు, మరీదు రాధిక పాల్గొన్నారు.

ప్రజాపాలనకు పోటెత్తిన జనం

ఖమ్మంరూరల్: మండలవ్యాప్తంగా మొత్తం 30,637 దరఖాస్తులు అందియి. మండలంలో పెద్దవెంకటగిరి, ఏదులాపురం, పెద్దతండా గ్రామాల్లో శనివారం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. వెంకటగిరి గ్రామంల దరఖాస్తులు ఇచ్చేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వెంకటగిరి గ్రామంలో మొత్తం 2076 దరఖాస్తులు అందాయి. ఏదులాపురంలో 944, పెద్దతండాలో 597 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తామని తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పేర్కోన్నారు.

ప్రజాపాలనకు 1997దరఖాస్తులు

తల్లాడ: మండలంలోని గొల్లగూడెం, గోపాలపేట, నూతనకల్, తెలగవరం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ఈమేరకు గొల్లగూడెంలో 545, గోపాలపేటలో 1247, నూతనకల్‌లో 625, తెలగవరంలో 285చొప్పున మొత్తం 1997దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, సర్పంచ్‌లు నారపోగు వెంకట్, నల్లమోతు మోహన్‌రావు, తేళ్లూరి కృష్ణయ్య, తూము శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ గౌతమ్



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మధిరరూరల్, జనవరి6: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ.గౌతమ్ సూచించారు. శనివారం మధిర మండలం సిరిపురంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. అర్హులైన ప్రజలు ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ పథకాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం సీపీ సునీల్‌దత్, సర్పంచ్ కనకపూడి పెద్దబుచ్చయ్య, ఎంపీటీసీ నండ్రు కుమారి, కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, చీదిరాల వెంకటేశ్వర్లు, దుంపా వెంకటేశ్వర్‌రెడ్డి, వనమా పిచ్చయ్య, మన్నేపల్లి గురునాథం, నండ్రు విజయరావు, కంభంపాటి సునందరావు, కనకపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చావో.. రేవో అని ఎన్నికల్లో పోరాడాం

- నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన మనోధైర్యంతోనే ఈ విజయం
- మధిర పౌర సన్మాన సభలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



మధిరటౌన్, జనవరి6: చావో, రేవో... ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదు అని ప్రాణాలకు తెగించి ఎన్నికల రణక్షేత్రంలో పోరాడి కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా శ్రమించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిర ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే ఈ విజయం సాధించానని పేర్కొన్నారు. శనివారం రెడ్డీ గార్డెన్స్‌లో పౌర సన్మానాన్ని మండల కాంగ్రెస్ పార్టీ, మధిర మండల ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా, కాంగ్రెస్ పని అయి పోయిందని ప్రచారం చేసినా అసెంబ్లీలో ఉన్న ఐదుగురు ఎమ్మెల్యేలతోనే పోరాటం చేసామని గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే ప్రభుత్వాన్ని నిలదీసామని అన్నారు. ఇంతకు ముందులా మధిర ప్రజలను కలవలేక పోయినా, మధిరకు ఏమి కావాలో తనకు తెలుసని వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానని భరోసా ఇచ్చారు. మధిర అంటే నాకు ప్రాణం, అని మధిర ప్రజలు తలదించుకునే పని తాను చేయనని ఉద్వేగభరితంగా చెప్పారు. మధిరలో విద్యా, వైద్య, యువతకు ఉపాది అకకాశాలు కల్పించేందుకు ఆలోచన చేస్తున్నానని అన్నారు. అనంతరం భట్టీ దంపతులను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ నాయకులు బెజవాడ రవి , కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం హోదాలో నేడు తొలిసారి స్వగ్రామానికి ..

వైరా:డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క పదవీ బాధ్యతలు చేపట్టిన తొలిసారి ఆదివారం వైరా మండలంలోని తన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి రానున్నారు. స్వగ్రామంలోని ప్రజలు భట్టి విక్రమార్కకు సాదరస్వాగతం పలికి సన్మానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజకీయ గురువైన దివంగత పీసీసీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు 34వ వర్ధంతిలో కూడా భట్టి విక్రమార్క పాల్గొంటారు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు దొడ్డా పుల్లయ్య, స్నానాల లక్ష్మీపురం ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, పమ్మి అశోక్, గుగులోతు రాము, చిత్తోజు వెంకటాచారి, మాదాసు ఉప్పలయ్య, బొమ్మిడాల శ్రీనివాస్, లక్ష్మణ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

తెలంగాణ విశ్రాంతి ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

సత్తుపల్లి, జనవరి6: సత్తుపల్లిలోని తెలంగాణ విశ్రాంతి ఉద్యోగుల సంఘం డైరిని శనివారం సత్తుపల్లి ఉపకోశాధికారి సునీల్ ఆవిష్కరించారు. సమస్యలను తన పరిధిలోని ఉన్న మేరకు పరిష్కరిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చెంచిరెడ్డి, యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్ నాయకులు బి.దాసు, జి.కృష్ణయ్య, ప్రకాశరావు, ఎ వెంకటరత్నం, మధుసూధన్‌రాజు, సంగిరెడ్డి పాల్గొన్నారు.

హార్వెస్ట్ ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డికి మాతృవియోగం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి6: హార్వెస్ట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాతృమూర్తి రామసహాయం సునీతాదేవి (85) శనివారం మృతి చెందారు. వయోభారంతో స్వగృహం తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో మృతిచెందారు. ఆమె భర్త భువనసందర్‌రెడ్డి జడ్పీచైర్మన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆమె నేత్రాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు అరవిందరెడ్డి న్యాయ వాదిగా, పార్వతీరెడ్డి హార్వెస్ట్ విద్యాసంస్థల్లో ప్రిన్సిపాల్‌గా, మిగిలిన ఇద్దరు కుమార్తెలు విదేశాల్లో స్థిరపడ్డారు. ఆమె మృతి పట్ల హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు మృతదేహాని సందర్శించి నివాళ్ళులు అర్పించారు. మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకరరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ పలువురు నాయకులు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న తుంబూరి దయాకరరెడ్డి, ఇన్‌సెట్ (సునీతాదేవి ఫైల్)

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

ఖమ్మంమార్కెట్, జనవరి6: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను శనివారం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. మార్కెట్‌లో శుక్రవారం మిర్చి ధర ఒక్కసారిగా తగ్గడానిక గల కారణాలను మార్కెట్ అధికారులతో మాట్లాడారు. చైనా ఎగుమతులు పెద్దగా లేకపోవడం, ఇటీవల తుఫాన్ కారణంగా తడిచిన పంట మార్కెట్‌కు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. నాణ్యత లేనికారణంగానే ధర తగ్గించి వ్యాపారులు కొన్నారని వివరించారు. ఈసమావేశంలో డీఎంవో అలీం, గ్రేడ్ 3 మార్కెట్ కార్యదర్శి బజార్ పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం,జనవరి6:నగర శివారులోని ధంసలాపురానికి చెందిన పిట్టల కనకయ్య(37) ఈనెల 4న చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాద వశాత్తు నీటిలో పడి గల్లంతైయ్యాడు. కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా, శుక్రవారం అర్ధరాత్రి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమోషన్లు, బదిలీలను చేపట్టాలి

బోనకల్, జనవరి6: నిలిచి పోయిన టీచర్ల ప్రమోషన్లు, బదిలీలను వెంటనే చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో శనివారం జరిగిన ఆ సంఘ మండల మహాసభలో మాట్లాడారు.

అంకితభావంతో పని చేయాలి

ఎంఈఓ రాములు

నేలకొండపల్లి, జనవరి6: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని మండల విద్యాధికారి రాములు అన్నారు. టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను శనివారం నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నవాబ్‌సాహెబ్, గోవిందరావు, మండల బాధ్యులు తొర్తి గురవయ్య, ఉపాధ్యాయులు కవిత, రాజ్యలక్ష్మి, మంగమ్మ, పార్వతి, శ్రీనివాసరావు, ఫణి, సత్యనారాయణ, కోటేశ్వరరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ఖమ్మంరూరల్,జనవరి6: మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఖమ్మంకు చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం దుప్పట్లు, గిఫ్ట ప్యాక్‌లను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యయుడు జి.శ్రీనివాసరావు, సర్పంచ్ సంధ్యారాణి, సొసైటీ ప్రతినిధి జాన్, ఉపసర్పంచ్ ఉపేందర్, వెంకటరమణ, నాగయ్య పాల్గొన్నారు.

గంగాధరరావు ఆశయ సాధనకు కృషి చేద్దాం

సీపీఎం మండల కార్యదర్శి కేవీరెడ్డి

నేలకొండపల్లి,జనవరి6:సీపీఎం నాయకుడు అమరజీవి నూతక్కి గంగాధరరావు ఆశయ సాధనకు కృసి చేయటమే ఆయనకిచ్చే నిజమైన నివాళని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నేలకొండపల్లిలోని రావెళ్ళ భవన్‌లో జరిగిన గంగాధరరావు 32వ వర్ధంతి సభలో రెడ్డి మాట్లాడారు. గంగాధరరావు నిఖార్సైన కమ్యూనిస్టుగా, తాను నమ్మిన సిద్దాంతం కొరకు తుదికంటా పోరాడారన్నారు. కార్యక్రంలో గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, మండడపు మురలీకృష్ణ, పగిడికత్తుల నాగేశ్వరరావు,దుగ్గి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.తొలుత గంగాధర రావు చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. శనివారం ఉదయం సీపీఎం నాయకుడు కొలికపంగు మైసయ్య వర్ధంతి సభను నిర్వహించారు.



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి కేవీరెడ్డి

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

మధిర,జనవరి6: డ్రైవర్లకు ప్రమాదకరమైన భారతీయ న్యాయసంహిత బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 104(2)ను రద్దు చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై ఆందోళన చేశారు. కార్మికులకు, ముఖ్యంగా డైవర్లకు ప్రమాదకరంగా ఉన్న సెక్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణ, వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి జీ.పద్మావతి, కార్మికులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి6: ఐఎన్‌టీఎస్‌ఓ(ఇండాయన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఓలంపియడ్) పరీక్షా ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియడ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ తెలిపారు. మెత్తం 314 మంది ప్రతిభ కనబరచి ద్వితీయ పరీక్షకు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిని యాజమాన్యం అభినందించింది. భవిష్యత్‌లో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య అక్షింతల శోభయాత్ర

కల్లూరు, జనవరి6: మండలంలోని ఎర్రబోయినపల్లి, లింగాల, ఖాన్‌ఖాన్‌పేట గ్రామాల్లో అయోధ్య అక్షింతల శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. అయోధ్య అక్షింతలతో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు కోలాటాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల శివారు ప్రాంతాలకు అయోధ్య అక్షింతలు చేరగానే భక్తులు మేళాతాళాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ప్రతీ కుటుంబానికి ఈ అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామ ఆలయం కమిటీ చైర్మన్ కొమ్మినేని నాగేశ్వరరావు, ప్రముఖులు పోట్రు శ్రీనివాసరావు, నాగళ్ల శ్రీనివాసరావు, పోట్రు అర్జునరావు, రేపాల రామకృష్ణ, మహిళ భక్తులు సీహెచ్ చూడామణి, పోట్రు లక్ష్మీ, కే ఆండాళ్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబోయనపల్లిలో శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

విలేకరికి రూ.15వేల ఆర్థికసాయం

ముదిగొండ, జనవరి6: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పత్రికా విలేకరి ఉప్పు కోటేశ్వరరావుకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య నగదు అందజేశారు. శనివారం ముదిగొండలో కోటేశ్వరరావును ఆయన పరామర్శించారు. రూ.15వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. పరిశ పుల్లయ్య తన సతీమణి సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి జిల్లాలో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కందిమళ్ల వీరస్వామి, కోశాధికారి నూకల వెంకటరమణ, గౌరవ సలహాదారులు పుచ్చకాయల అచ్చుతరావు, వనం కృష్ణకాంత్ పాల్గొన్నారు.

నిస్వార్థనాయకుడు తుళ్లూరు సత్యం

సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు

కొణిజర్ల,జనవరి6: నిస్వార్థ నాయకుడు తుళ్లూరు సత్యం అని సీపీఐ జాతీయసమితి సభ్యులు భాగం హేమంత రావు కొనియాడారు. మండల పరిధిలోని తనికెళ్ళలో శనివారం తుళ్లూరు సత్యం వర్ధంతి సందర్భంగా అతడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్, జితేందర్‌రెడ్డి, పివిరావు, గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర్లు, పొట్లపల్లి సీతరాములు, , కొనపర్తి విష్ణుమూర్తి, గడల భాస్కర్‌రావు, లేడిబోయిన గోపాల్‌రావు, నాయకులు రత్తమయ్య, గడల శ్రీను, సరవయ్య, బాస రాజు, తుళ్లూరి మురళి, పసుమర్తి శంకర్‌రావు, మంచికంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గొర్రెల డీడీలు వెనక్కి తీసుకోవద్దు

జీఎంపీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కాసాని

పెనుబల్లి, జనవరి 6: గొర్రెల పంపిణీ పథకంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.రెండులక్షల నగదును వెంటనే బదిలీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కాసాని ఐలయ్య కోరారు. పెనుబల్లిలో ఆసంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతలచెర్వు కోటేశ్వరరావు, కార్యదర్శి లింగయ్య, రాష్ట్రకమిటీ సభ్యుడు మామిళ్ల వెంకటేశ్వరరావు, గాయం తిరుపతిరావు, బొడ్డు నర్సింహారావు, మామిళ్ల సోమయ్య, తోట కృష్ణ, పాశం తిరుపతిరావు, రాజు పాల్గొన్నారు.

మల్లుపల్లిలో వైద్యశిబిరానికి స్పందన

కొణిజర్ల,జనవరి6: మండల పరిధిలోని మల్లుపల్లిలో శనివారం కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యశాఖ, ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. రక్తనమూనాలను సేకరించి టీహబ్‌కి పంపించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. చలికాలం వేడిచేసి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి సాధియా తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం

ఏన్కూరు,జనవరి6: ఏన్కూరు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలలో హెచ్‌ఎం పాండురంగయ, ఉపాధ్యాయులు చంద్రిక, సత్యవతి, నిర్మల, లత, అన్నపూర్ణ, అనిత పాల్గొన్నారు.

ఖమ్మం కవులకు సన్మానం

ఖమ్మంసాంస్కృతికం, జనవరి6: రాజమండ్రిలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో ఖమ్మం జిల్లాకు చెందిన పదిహేనుమందికిపైగా కవులను సన్మా నించారు. సభల్లో కవిత, గజల్ ఆలపించినందుకు కవి కట్టెకోల చిన నరసయ్య, లెనిన్ శ్రీనివాస్ రాణా ప్రతాప్, కొత్తపల్లి కృష్ణారావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, ఏ. జయవాసు, ఎం . గోవిందు, జి. శోభనాద్రి, మందుల వీరభద్రం, నల్లా కృష్ణమూర్తి, జీఎస్‌ఆర్, అంజనేయులు, వై రాజేందర్ , మేళ్లచెరువు బాబు, కోటగిరి వెంకటనరసయ్య లను శాలువాలు, పూలదండలతో అభినందించారు.

రంగారావును పరామర్శించిన ఎంపీ వద్దిరాజు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి6: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు సోదరుడు సుధాకర్ ఇటీవల మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం శెట్టి రంగారావు ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, ఆకుతోట ఆదినారాయణపాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా వితరణ

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి6: నగరంలోని 21వ డివిజన్ ద్వారకానగర్ సెక్టార్ పాకబండబజార్ అంగన్‌వాడి కేంద్రానికి శనివారం నగారానికి చెందిన నరేష్, సౌమ్యా దంపతులు ఇనుప బీరువాన వితరణగా అందించారు. దాతల సహకరంతో ఆటవస్తువులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ కవిత, సెక్టార్ సూపర్‌వైజర్ సునీతా పాల్గొన్నారు.



బీరువా వితరణగా అందిస్తున్న దాతలు